సాక్షి
నిజామాబాద్

శనివారం, 18, అక్టోబర్, 2025



గాలికుంటు వ్యాధికి..
పాడి పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం జిల్లాలో టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది.

- IIలో ▸



670 కొనుగోలు కేంద్రాలు..
వరి ధాన్యం సేకరణకు జిల్లాలో 670 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
35.2 /20.2

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. రోజంతా మబ్బులతో కూడిన ఎండ ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎంకు సుదర్శన్‌రెడ్డి కృతజ్ఞతలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేయడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు.

రెవెన్యూ సిబ్బంది బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ అర్బన్: రెవెన్యూశాఖలోని తొమ్మిది మంది సిబ్బందిని బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 15న ప్రచురితమైన 'రేషన్‌కార్డుల్లో భారీ అక్రమాలు' కథనంపై అధికారులు స్పందించారు. వివిధ మండలాల్లో అనర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేశారని రెవెన్యూ సిబ్బందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు.

పసుపు రైతుల సంక్షేమానికి కృషి

- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



సుభాష్‌నగర్: పసుపు రైతుల సంక్షేమం కోసం జాతీయ పసుపు బోర్డు ఎల్లప్పుడూ పనిచేస్తుందని బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. వరంగల్, ఏపీలోని అరకు జిల్లా పాడేరు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన పలువురు రైతులు శుక్రవారం నగరంలోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని సందర్శించారు. పల్లె గంగారెడ్డి వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉత్పత్తి వ్యయం, మార్కెట్‌లో ధరల అస్థిరత, పంట సంరక్షణలో ఎదురయ్యే సవాళ్లు వంటి అంశాలపై పరిష్కార మార్గాలను చర్చించారు.

పాఠశాలకు రూ.50 వేల విరాళం



మోపాల్ : మోర్తాడ్ మండలంలోని సిర్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు దూస లక్ష్మణ్ విద్యా ఆశయం స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ.50 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం ప్రధానోపాధ్యాయులు వి సత్యనారాయణకు అందజేశారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలలో రెండు సంవత్సరాలుగా జరుగుతున్న వివిధ విద్య అభివృద్ధి పనులు గమనించి ఆర్థికసాయాన్ని అందజేశారని తెలిపారు. అనంతరం సంస్థ ప్రతినిధులు దూస దాసు, ఆరుగొండ దయానంద్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గెలుచుకున్న బహుమతులను గుర్తించి, వారి ప్రతిభా పాటవాలను మరింత ప్రోత్సహించేలా ఈ విద్యానిధిని అందించినట్లు పేర్కొన్నారు. తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ కాసర్ల నరేషరావు చొరవతో పాఠశాల అవసరాలను గుర్తించి ఈ నిధిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, అక్బర్ బాషా, డాక్టర్ శ్రీనివాస్ హజారే, లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లోని ధర్నాచౌక్‌లో నిరసనలో పాల్గొన్న ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, జర్నలిస్టులు

నిజాలు రాస్తే వేధింపులా..!

'సాక్షి'పై అక్రమ కేసులను ఎత్తి వేయాలి

- నినదించిన జర్నలిస్టు, వామపక్ష, విద్యార్థి, సంఘాల ప్రతినిధులు
- జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ, ధర్నా



నిజామాబాద్‌అర్బన్ : 'సాక్షి' దిన పత్రికపై, ఎడిటర్ ఆర్. ధనంజయ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో శుక్రవారం జర్నలిస్టు సంఘాలు, వామపక్ష సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించాయి. సంఘాల ప్రతినిధులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని, మీడియా లేకుంటే ప్రజల హక్కులు హరించుకుపోతాయన్నారు. అలాంటి మీడియాపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఎండగట్టారు.

మొదట ఎన్టీఆర్ చౌరస్తా నుంచి కోర్టు చౌరస్తా వరకు, తిరిగి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు ధర్నా చేశారు.

బాబుది నిరంకుశ పాలన



ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నిరంకుశ పాలన కొనసాగుతోంది. గతంలోనే చంద్రబాబు ప్రపంచ బ్యాంకు జీతగాడు అని మేమే వ్యతిరేకించాం. ప్రజాపాలనను పక్కనపెట్టి కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నాడు. కొన్నేళ్లుగా ఇదే విధానం కొనసాగుతోంది. పత్రికలపై కక్షపూరిత చర్యలు సిగ్గుచేటు, అక్రమ కేసులు బనాయించడం, ఎదుటి వారిని బెదిరించడం అలవాటుగా మార్చుకున్నాడు. తక్షణమే సాక్షి మీడియాపై పెట్టిన కేసులను వెనక్కు తీసుకోవాలి. ఇతర మీడియాలు కూడా సాక్షికి మద్దతుగా నిలవాలి. మీడియాపై ఎవరు కేసులు నమోదు చేసినా, కక్షపూరిత చర్యలకు పాల్పడినా అందరూ ఒక్కటై కలిసికట్టుగా ఎదుర్కోవాలి. మీడియాకు మేము అండగా ఉంటాం. –వి. ప్రభాకర్, సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథ రాష్ట్ర నాయకుడు

ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ



సాక్షి మీడియా నిజాలు రాస్తే చంద్రబాబు ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. ఇది ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. మీడియాను తన గుప్పిట్లో పెట్టుకుని అరాచకాలు సృష్టించాలని చంద్రబాబు చూస్తున్నాడు. దీనికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. –ముప్పు సుధాకర్, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

మీడియాను తొక్కిపెట్టడమే..



అక్రమ కేసులు బనాయించి పోలీసులతో నిర్బంధించడం, జర్నలిస్టుల ఇండ్లలో తనిఖీలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం ఏమాత్రం సరైనది కాదు. అనుకూలమైన వార్తలు రాయాలంటూ బెదిరించడం, మీడియాను తొక్కిపెట్టాలని ప్రయత్నాలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. –వనమాల కృష్ణ, సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథ రాష్ట్ర నాయకులు

కూటమి ప్రభుత్వం వెనక్కు తగ్గాలి



చంద్రబాబు పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని తుద ముట్టించాలని ప్రయత్నం చేస్తున్నాడు. తన తప్పులను వెలికి తీసే వారి పై అక్రమ కేసులు బనాయించడం, అధికారాన్ని అడ్డుపెట్టుకొని నిరంకుశత్వంతో ప్రజలను, పత్రిక విలేకరులను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదు. దీనిపై తక్షణమే ప్రభుత్వం వెనక్కు తగ్గాలి. –సుజాత, ఐద్వా జిల్లా కార్యదర్శి

అక్రమ నిర్బంధం తగదు



కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తోంది. కక్షపూరితమైన విధానాలు కొనసాగిస్తోంది. తన తప్పులను వెలికి తీసేందుకు ప్రయత్నించే వారిని అక్రమంగా నిర్బంధిస్తున్నారు. పత్రిక విలేకరులపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేయడమంటే దారుణం. ప్రజాస్వామ్యంలో మీడియాకు స్వేచ్ఛ లేకుంటే ప్రజలు ఎలా బతికేది. –ఖైసర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు

కాంటాలు ఇంకెప్పుడో..

- నామ మాత్రంగా ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు
- నెల నుంచి సాగుతున్న వరికోతలు
- ధాన్యం తరలించి కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- మరోవైపు వెంటాడుతున్న వరుణుడి భయం



వెల్మల్ గ్రామంలో ఆరబెట్టిన వరిధాన్యం

నందిపేట్(ఆర్మూర్) : జిల్లాలో వరికోతలు ప్రారంభమై నెలరోజులవుతోంది. అధికారులు వివిధ ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. ఇప్పటి వరకు కొనుగోలు మాత్రం చేయడం లేదు. కోత కోసిన ధాన్యాన్ని చాలా గ్రామాల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబెడుతున్నారు. ఇలా ఆయా గ్రామాల్లో ధాన్యం రాశులు కుప్పలు తెప్పలుగా పేరుకు పోతున్నాయి. మరోవైపు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో వరి కొనుగోళ్లు ఎప్పుడెప్పుడా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల వివరాలు

సంస్థలు	కేంద్రాలు
పీఏసీఎస్	374
ఐకేపీ	261
ఐడీసీఎంఎస్	24
మెప్మా	10
ఎఫ్‌డీవో	1



చింరాజ్‌పల్లి గ్రామంలో వరిధాన్యం కుప్పలు

జిల్లాలో 670 కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 4,36,695 ఎకరాలలో వరి సాగు చేశారు. జిల్లాలో 670 కొనుగోలు కేంద్రాల ద్వారా 8.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పాటికే సగం వరకు కేంద్రాలను పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా, ఐసీడీఎంఎస్, ఎఫ్‌డీవోల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

కాంటాలు జరగడం లేదు



వరిధాన్యం చేతికి వచ్చి 15 రోజులు అవుతోంది. కొనుగోలు కేంద్రాలను నామ్‌కే వస్తేగా ప్రారంభించారు. కాంటాలు మాత్రం జరగడం లేదు. ఇంకా ఎన్ని రోజులు వెయిట్ చేయాలి. కూలీల అద్దె తడిసి మోపెడవుతోంది. దీపావళి అయినా తర్వాత అయినా కొనుగోళ్లు జరపాలి.
– తోట గణేశ్, చింరాజ్‌పల్లి గ్రామం, నందిపేట మండలం

త్వరగా ప్రారంభించాలి



కోతలు పూర్తి చేసి వడ్లను కొనుగోలు కేంద్రాలకు తరలించాం. గత 15 రోజుల నుంచి ధాన్యాన్ని ఆరబెట్టి కుప్పలుగా పోగు చేసి టార్పాలిన్ కప్పి ఉంచాను. ఎక్కడ వర్షం పడి ఎండిన ధాన్యం తడిసి పోతుందోనని భయం కలుగుతోంది. కాంటాలు ప్రారంభించి ధాన్యాన్ని త్వరగా తరలించాలి.
– బద్దం సాయరెడ్డి, తల్వేద గ్రామం, నందిపేట మండలం

లోపాలు లేకుండా

జిల్లాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ధాన్యంసేకరణ చేపడుతాం. మిల్లర్లు కూడ ధాన్యాన్ని దించేందుకు ఒప్పుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో ఇప్పటి వరకు 80 మిల్లులను కేటాయించాం. ధాన్యం సేకరణ వేగవంతం చేసేలా చర్యలు చేపడుతాం. – అరవింద్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్, ఎమ్మెల్యే భూపతి రెడ్డి తదితరులు

మెజార్టీ అభిప్రాయానికి ప్రాధాన్యత

- డీసీసీ అధ్యక్షుని ఎన్నికపై పార్టీ జిల్లా పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్
- డిచ్‌పల్లిలో రూరల్ బ్లాక్ కాంగ్రెస్ స్థాయి సమావేశం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం, కాంగ్రెస్ పార్టీకి విధేయులై అందరినీ కలుపుకొని పోయే వారికే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి దక్కుతుందని పార్టీ జిల్లా పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ స్పష్టం చేశారు. డీసీసీ అధ్యక్ష ఎన్నికలపై 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కేఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన నిజామాబాద్ రూరల్ బ్లాక్ కాంగ్రెస్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ప్రక్షాళన చేయాలని అధినేతలు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే ఆలోచనల మేరకు డీసీసీ అధ్యక్షుడి నియామకం కోసం గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రతి కార్యకర్త, నాయకుల అభిప్రాయాన్ని సేకరిస్తున్నామని తెలిపారు. పార్టీకోసం ఎళ్లవేళలా కష్టపడే వారు, పార్టీని వీడకుండా 10 సంవత్సరాలకు పైగా క్రియాశీలకంగా పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో అధిక ఎంపీలను గెలిపించుకుని రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

సీఎంకు ధన్యవాద తీర్మానం

జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు ధన్యవాదాలు తెలియజేస్తూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి పంపిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ తెలిపారు. వ్యవసాయ కళాశాల మంజూరులో తనతో పాటు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కృషి ఉందన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందన్నారు. రానున్న రోజుల్లో డిచ్‌పల్లికి వెటర్నరీ కళాశాల మంజూరుకు తీర్మానం చేసి పంపిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్ డిచ్‌పల్లి, మోపాల్, నిజామాబాద్ రూరల్, జక్రాన్‌పల్లి మండలాలకు చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలను వేర్వేరుగా గదిలోకి పిలిపించుకుని వారి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పార్టీ నేతలు మానాల మోహన్‌రెడ్డి, కాటిపల్లి నగేశ్‌రెడ్డి, శేఖర్ గౌడ్, ముప్పగంగారెడ్డి, మునిపల్లి సాయారెడ్డి, మార చంద్రమోహన్, పాలసాని శ్రీనివాస్, అమృతాపూర్ గంగాధర్, ఎల్లన్న, సాయారెడ్డి, చిన్నారెడ్డి, కంచెట్టి గంగాధర్, చిన్నోల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మనోళ్ల దారెటు..

- ఉమ్మడి జిల్లా నుంచి అజ్ఞాతంలో ఏడుగురు
- ఎస్‌జెడ్‌సీ సభ్యుని హోదాలో స్వామి
- వివిధ స్థాయిల్లో పలువురు

అజ్ఞాతమా? జన జీవనమా?

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌కు పదును పెట్టి దండకారణ్యాన్ని జల్లెడ పడుతోంది. కొంత కాలంగా భద్రతాదళాలు జరుపుతున్న కాల్పుల్లో వందలాది మంది చనిపోయారు. మరెందరో అరెస్టయ్యారు. లొంగుబాట్లు కూడా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అజ్ఞాత నక్సల్స్ ఎక్కడున్నారు? వాళ్ల దారి ఎటువైపు ? అన్నదానిపై చర్చ జరుగుతోంది. కామారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలోని ఇస్రోజివాడి గ్రామానికి చెందిన లోకేటి చందర్ అలియాస్ స్వామి బస్తర్‌లో స్పెషల్ జోనల్ కమిటీ (ఎస్‌జెడ్‌సీ) సభ్యుని హోదాలో పనిచేస్తున్నట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఆయన మూడు దశాబ్దాల కాలంగా విప్లవోద్యమంలో ఉన్నారు. అప్పట్లో నిజామాబాద్ జిల్లా పడ్కల్‌లో 36 గంటలకు పైగా సాగిన ఎన్‌కౌంటర్‌లో స్వామి తప్పించుకున్న తీరు గురించి రకరకాలుగా చెప్పుకుంటారు. రెండు దశాబ్దాల కిందట అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తీవ్ర నిర్బంధం విధించడంతో స్వామిని దండకారణ్యానికి పంపించారు. అప్పటి నుంచి ఆయన తిరిగి జిల్లా వైపు రాలేదని చెబుతారు. తండ్రి చనిపోయినా, ఇటీవల తల్లి చనిపోయినా ఇంటి ముఖం చూడలేదు. అయితే స్వామి భార్య లోకేటి సులోచన అలియాస్ నవత కూడా కొంత కాలానికే ఆయన వెంట నడిచింది. దళ కమాండర్‌గా సౌత్ బస్తర్ ప్రాంతంలో పనిచేస్తుండగా ఏడెనిమిదేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోగా అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రులిద్దరూ అజ్ఞాతంలో ఉండడంతో పిల్లలిద్దరూ బంధువుల వద్ద ఉండి చదువుకున్నారు. అయితే 2009లో వాళ్లిద్దరూ కూడా అడవిబాట పట్టారు. స్వామి కొడుకు లోకేటి రమేశ్ సౌత్ బస్తర్ కొంటా ఏరియాలో డీసీఎంగా పనిచేస్తునట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఆయనపై రూ.4 లక్షల రివార్డుంది. అలాగే స్వామి కూతురు శాంతి అలియాస్ లోకేటి లావణ్య కూడా అన్నతో కలిసి అడవిబాట పట్టింది. తల్లిదండ్రులతోపాటు ఇద్దరు పిల్లలు కూడా అజ్ఞాతంలోనే ఉండగా తల్లి సులోచన అనారోగ్యంతో చనిపోయింది. కాగా స్వామి, రమేశ్, లావణ్య ముగ్గురూ వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్నట్టుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. పాల్వంచ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్ దినేశ్ అలియాస్ సంతోష్ 2001లో అజ్ఞాతంలోకి వెళ్లినట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఆయన దళ కమాండర్ హోదాలో ఉన్నారు. ఇతనిపై రూ .5 లక్షల రివార్డు ఉంది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి 1999 నుంచి అజ్ఞాతంలో ఉన్నారని, ఆయన ఏ స్థాయిలో పనిచేస్తున్నది మాత్రం పోలీసుల రికార్డుల్లో పేర్కొనలేదు. అతనిపై రూ.లక్ష రివార్డు ఉంది. ధర్పల్లి మండలం లింగాపూర్‌కు చెందిన ఒకరు, డిచ్‌పల్లి మండలం ఇందల్వాయికి చెందిన మరొకరు దండకారణ్యంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నట్టు సమాచారం.



స్వామి @ లోకేటి చందర్



సంతోష్ @ ఎర్రగొల్ల రవి



లోకేటి రమేశ్



లోకేటి లావణ్య అలియాస్ శాంతి

పోలీసుల అదుపులో లావణ్య?

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గంగులూరు ప్రాంతంలో కామారెడ్డి జిల్లా ఇస్రోజివాడికి చెందిన మావోయిస్టు నాయకురాలు లోకేటి లావణ్య అలియాస్ శాంతి పోలీసులకు చిక్కినట్టు తెలుస్తోంది. ఏరియా కమిటీ మెంబర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసు రికార్డుల్లో ఉంది. ఆమెపై రూ.4 లక్షల రివార్డు ఉంది. లావణ్య అరెస్టు అయ్యిందా ? లొంగిపోయిందా ? ఎక్కడ ఉన్నది తెలియరాలేదు. అలాగే లోకేటి రమేశ్ తనతో కలిసి పనిచేస్తున్న దళసభ్యురాలిని వివాహమాడినట్టు సమాచారం. రమేశ్ భార్య కూడా ఇటీవల అరెస్టయి జైల్లో ఉన్నట్టు తెలుస్తోంది.

క్లుప్తంగా

తెయూలో స్పాట్ అడ్మిషన్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో 2025–26 విద్యాసంవత్సరానికి గానూ మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ వాసం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 21 మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. అదేరోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్లు ఇస్తారని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకుని వచ్చి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు విద్యాసంస్థల బంద్!

ఖలీల్‌వాడి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు విద్యార్థి సంఘాల నేతలు శుక్రవారం తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు రాష్ట్ర బంద్‌లో పాల్గొనాలని వారు కోరారు. రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాలలలో కూడా 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మక్క కొనుగోలు కేంద్రాల పెంపు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో మక్క కొనుగోలు కేంద్రాల సంఖ్యను అధికారులు పెంచారు. ఇప్పటివరకు జిల్లాలో 10 కేంద్రాలను ఏర్పాటు చేసి, మొక్కజొన్న కొనుగోళ్లను అధికారులు కొనసాగించారు. మొత్తంగా 26 కొనుగోలు కేంద్రాలను ఖరారు చేసిన అధికారులు.. గ్రామాల్లో రైతుల నుంచి డిమాండ్ రావడంతో అదనంగా మరో ఐదు సెంటర్లను పెంచారు. భీమ్‌గల్, బ్రహ్మన్‌పల్లి, గోవిందపేట్, మంథని, ఆర్మూర్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో జిల్లాలో మక్క కొనుగోలు కేంద్రాల సంఖ్య 31కి చేరింది. పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని సహకార సొసైటీలకు సూచించామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ దాసోజు మహేశ్ వెల్లడించారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం



నిజామాబాద్‌అర్బన్: పత్రికా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోమని జిల్లాలోని జర్నలిస్టులు, వివిధ సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాక్షి మీడియాపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో వారు నిరసన వ్యక్తం చేశారు. సాక్షి బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి ప్రభాకర్, అడ్వర్టైజర్ మేనేజర్ సంపత్, ఆర్సీ ఇన్‌చార్జి, జర్నలిస్టులు పాకాల నర్సింలు, మండే మోహన్, ఏబీవీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వం అరాచకాలు..



కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ప్రజాస్వామ్య విధానాలను పట్టించుకోకుండా కక్షపూరితమైన పరిపాలన కొనసాగిస్తుంది. ప్రజాస్వామ్యాన్ని మంటగలిపి ప్రజల హక్కుల్ని కాలరాస్తున్నారు. ప్రజా సమస్యల కోసం ఎప్పుడు ముందుండే 'సాక్షి' మీడియాను గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీలో జరుగుతున్న అక్రమాలను వెలుగు తీస్తే కేసులు పెట్టి నిర్బంధించడం సరైనది కాదు.

–జన్నారపు రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

సాక్షి మీడియాకు క్షమాపణ చెప్పాలి..



సాక్షి ఎడిటర్‌పై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఏపీ ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి. 'సాక్షి'కి కూటమి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి. అక్రమాలను వెలికి తీస్తున్న 'సాక్షి'ని అభినందించకుండా, తప్పుడు వార్తల పేరిట యాజమాన్యంపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేయడం ప్రజాస్వామ్యంలోనే అవమానకరమైన ఘటన.

–గణేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

కక్షపూరిత విధానాన్ని మానుకోవాలి..



ప్రజాస్వామ్యంలో పత్రిక విలేకరులపై యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేయడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజులే. ప్రజల తరఫున పోరాటం చేసే మీడియాపై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం సరికాదు. దీంతో ప్రజల సమస్యలు వెలుగులోకి రాకుండా పోతాయి. తక్షణమే కూటమి ప్రభుత్వం ఈ కక్షపూరితమైన విధానాన్ని మానుకోవాలి.

–రఘురాం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ఐక్యంగా అడ్డుకుంటాం..



మీడియాపై ప్రభుత్వాల కక్ష సాధింపు చర్యలను జర్నలిస్టు సంఘాలు ఐక్యంగా పోరాడుతాయి. ఎల్లప్పుడూ ప్రజల కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడే జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడం, వారిని నిర్బంధించి ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదు. జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులపై జరిగే అక్రమ కేసుల దాడులను ఐక్యంగా అడ్డుకుంటాం,

–గంగదాస్, ఐజేయూ జాతీయ నాయకుడు

కేసులను వెనక్కు తీసుకోవాలి..



సాక్షి మీడియాపై పోలీసులు నమోదు చేసిన కేసులను వెంటనే వెనక్కు తీసుకోవాలి. అక్రమ మద్యం తయారీకి సంబంధించిన వార్తలు రాయడంలో ఎలాంటి తప్పులేదు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఉంది కాబట్టే పత్రిక హక్కుల ప్రకారం సాక్షి ఓ మంచి వార్తను వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిని పోలీసులు అక్రమ వార్త అంటూ కేసు నమోదు చేయడం సరైనది కాదు. వెంటనే కేసులు నమోదు వెనక్కు తీసుకోవాలి.

–అనిత, ఫెడరేషన్ రాష్ట్ర నాయకురాలు

సాక్షికి సపోర్టుగా ఉంటాం



అక్రమ కేసుల వ్యవహారంలో సాక్షి మీడియాకు మేము ఎల్లప్పుడూ అండగా ఉంటాం. మీడియాపై ప్రభుత్వాలు కేసులు నమోదు చేయడం, దాడులు చేయడం సరైనది కాదు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మీడియా ఎంతో కృషి చేస్తుంది. పోలీసులను అడ్డుపెట్టుకొని దాడులు చేయడం సరైనది కాదు. వెంటనే కేసులు వెనక్కు తీసుకోవాలి లేదంటే నిరంతరం నిరసనల కార్యక్రమాలు చేస్తాం.

–వెంకటేష్, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి

ప్రజాస్వామ్యాన్ని కూనీచేస్తుంది



ఏపీలో కూటమి ప్రభుత్వం మీడియా గొంతు నొక్కే యత్నం చేస్తుంది. ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడం సరైంది కాదు. సాక్షి మీడియాపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి. నిజాలు ప్రచురించినందుకు కేసులు పెట్టడం కక్ష సాధింపు చర్యలే. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యంను కూనీ చేస్తుంది.

–దుర్గ, ఏబీవీపీ జోనల్ ఇన్‌చార్జి

670 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



చందూరులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

వర్ని: రైతులు పండించిన వరి ధాన్యాన్ని సేకరించేందుకు జిల్లావ్యాప్తంగా 670 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వెల్లడించారు. మోస్రా, చందూర్, వర్ని మండల కేంద్రాల్లో శుక్రవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి రైతులకు లబ్ధి చేకూర్చేందుకు మరిన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. రైతులు తెచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్నట్లయితే వెంటనే తూకం జరిపి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపిస్తామన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించిన పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, రైతులకు సంబంధిత రసీదు అందజేయాలని, క్రాప్ బుకింగ్ డేటాలో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రాక్ సీట్లు వచ్చిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని దీని ద్వారా రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపు జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే పూర్తిస్థాయి మద్దతు ధర పొందవచ్చునన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, సహకార శాఖ అధికారి అంబర్ సింగ్, వర్ని ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా పాల్గొన్నారు.

ఒమన్‌లో చిక్కుకున్న సిద్దపల్లి వాసి

- క్లీనింగ్ విభాగంలో ఉపాధి అంటూ గొర్రెల కాపరిగా పనికి పురమాయించిన ఏజెంట్
- ఎడారిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనం
- తన తండ్రిని ఇంటికి రప్పించాలని ప్రవాసి ప్రజావాణిలో కూతురి వేడుకోలు



భోజ సురేష్ (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశం ఒమన్‌లో చిక్కుకున్న తన తండ్రిని స్వగ్రామానికి రప్పించాలని కూతురు కోరింది. ఈమేరకు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. వివరాలు ఇలా.. భీమ్‌గల్ మండలం సిద్ధపల్లికి చెందిన భోజ సురేష్‌ను ధర్పల్లికి చెందిన ఏజెంట్ ఒకరు ఆగష్టులో ఒమన్‌కు పంపించాడు. అక్కడ ఒక కార్యాలయంలో క్లీనింగ్ విభాగంలో పని కల్పిస్తానని నమ్మించి, సురేష్ వద్ద రూ.90వేలు తీసుకున్నాడు. తీరా ఒమాన్ వెళ్లిన తర్వాత యాంకూల్ పట్టణానికి సమీపంలోని ఒక గ్రామంలోని వ్యవసాయ క్షేత్రానికి తరలించారు. అక్కడ ఉన్న గొర్రెల మందకు కాపరిగా పని చేయాలని సూచించారు. తనకు చెప్పిన పని కాకుండా, ఎడారిలో గొర్రెలకు కాపలాగా ఉండటంతో అతడు నిత్యం చాలా ఇబ్బంది పడుతున్నాడు. తాను ఇక్కడ ఉండలేనని సురేష్ తన కుటుంబ సభ్యులతో గోడు వెళ్లబోసుకున్నాడు. ఇటీవల సురేష్ తల్లి చనిపోగా, అతని భార్య అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో తన తండ్రిని ఎలాగైనా ఇంటికి రప్పించాలని కోరుతూ బాధితుడి కూతురు తేజశ్రీ ప్రవాసీ ప్రజావాణిలో అధికారి జగదీష్ పటేల్‌కు, ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి 'సాక్షి'తో మాట్లాడారు. ఏజెంట్ చేతిలో మోసపోయిన సురేష్‌కు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందిస్తున్న సురేష్ కూతురు తేజశ్రీ

గాలికుంటు వ్యాధికి టీకాతో చెక్

- జిల్లాలో ప్రారంభమైన పశువులకు వ్యాక్సినేషన్
- ఈనెల 15 నుంచి నవంబర్ 14 వరకు కొనసాగనున్న కార్యక్రమం



పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు, సిబ్బంది

బోధన్‌రూరల్/ఆర్మూర్: పాడిరంగంలో అభివృద్ధి సాధించాలంటే పాడి పశువుల సంపూర్ణ ఆరోగ్యం అత్యంత కీలకమైనది. అలాంటిది పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే తీవ్రమైన నష్టాలను చవిచూడాల్సివస్తుంది. వ్యాధి సోకిన పశువులు నీరసించిపోవడంతోపాటు, పాలదిగుబడి తగ్గిపోతుంది. దీంతో ఈ వ్యాధిని నివారించడానికి గేదె, ఆవు జాతి పశువులకు ప్రతియేటా ఉచితంగా వ్యాధి నివారణ టీకాలను వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం ఈనెల 15న ఈ టీకాల కార్యక్రమం ప్రారంభం కాగా, నవంబర్ 14 వరకు కొనసాగనుంది. జిల్లాలో మొత్తం 82 టీంలను ఏర్పాటు చేసి ప్రాంతాల వారీగా పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

జిల్లాలోని పశువులు ఇలా..

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 2019లో చేపట్టి పశు గణాంకాల ప్రకారం జిల్లాలో గేదె జాతి పశువులు 2లక్షల 6వేల 898 ఉండగా, గో జాతి (ఆవులు, ఎడ్లు) పశువులు 1లక్ష 1వెయ్యి 252గా ఉన్నాయి. ఇప్పటికే పోషణ కరువై పశువులు, జీవాల సంఖ్య సుమారు 20 శాతం వరకు తగ్గిందని అధికారులు పేర్కొంటున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి రహిత జిల్లాగా మార్చడానికి ప్రస్తుతం పశువులకు టీకాలు వేస్తూ విశేష కృషి చేస్తోంది. గాలికుంటు వ్యాధిని నివారించగలిగితే ప్రత్యక్షంగా పశువుకి వ్యాధి వల్ల కలిగే బాధ నుండి ఉపశమనంతో పాటు ఆ పశువుపైన ఆధారపడిన రైతుకి ఆర్థిక స్వావలంబన చేకూరనుంది.

పశువులకు మాత్రమే టీకాలు..



గాలికుంటు వ్యాధిని నియంత్రించడానికి మొదట పశువులకు మాత్రమే టీకాలు వేస్తున్నామన్న విషయాన్ని రైతులు గమనించాలి. పశువుల్లో వ్యాధిని నియంత్రించ గలిగితే మేకలు, గొర్రెలకు సోకకుండా కాపాడవచ్చును. అప్పుడు జీవాలకు టీకాలు వేయాల్సిన అవసరం ఉండదు.

– లక్కం ప్రభాకర్, పశువైద్యాధికారి, పెర్కిట్, ఆర్మూర్ పట్టణం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి...



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేయిస్తున్నందున పశువులను పోషించే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వంద శాతం టీకాలు వేయించి గాలికుంటు రహిత జిల్లాగా తీర్చిదిద్ది మన పశువులను, జీవాలను కాపాడుకోవాలి.

– శైలజ, పశువైద్యాధికారి, పిప్రి ప్రాథమిక పశువైద్య కేంద్రం, ఆర్మూర్ మండలం

తప్పనిసరిగా టీకాలు వేయించాలి



జిల్లాలో 82 వైద్య బృందాలు ఏర్పాటు చేసి పశువులకు టీకాలు వేయిస్తున్నాం. జిల్లాలోని 33 మండలాల్లో ఆవు, గేదె జాతి పశువులను వారు గుర్తించి టీకాలు వేస్తారు. నవంబర్ 14 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. పాడి రైతులు తప్పనిసరిగా తమ పాడి పశువులకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

–రోహిత్ రెడ్డి, ఇన్‌చార్జి జిల్లాపశువైద్యాధికారి, నిజామాబాద్

నేడు సెపక్‌తక్రా అండర్-14 జట్ల ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పోతంగల్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా సెపక్‌తక్రా అండర్–14 బాలబాలికల విభాగంలో జిల్లా జట్ల ఎంపికపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి జిల్లా జట్టుకు ఎంపికలు చేస్తారన్నారు.

దోమకొండలో ఆర్చరీ ఎంపికలు..

నిజామాబాద్‌నాగారం: కామారెడ్డి జిల్లా దోమకొండలో నేడు ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 బాలబాలికల విభాగంలో ఆర్చరీకి ఎంపికలు నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి తెలిపారు. వివరాలకు 94900 15388ను సంప్రదించాలన్నారు.

ఆర్మూర్ ఎస్సై వీఆర్‌కు బదిలీ!

నిజామాబాద్‌అర్బన్: ఆర్మూర్ ఎస్సై వినయ్ కుమార్‌ను వీఆర్‌కు అటాచ్ చేస్తూ సీపీ సాయిచైతన్య ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఇటీవల ఆర్మూర్‌లోని పాత బస్టాండ్‌లో ఓ కిరాణ దుకాణ యజమానిని ఎస్సై వేధించినట్లు ఓ వీడియో వైరల్ అయింది. ఈ విషయం సీపీ దృష్టికి రావడంతో ఎస్సైను వీఆర్‌కు అటాచ్ చేసినట్లు సమచారం.

బీసీ బంద్‌కు కాంగ్రెస్ మద్దతు



నిజామాబాద్ సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు జిల్లా కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘాల సొసైటీ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ బీసీ బంద్‌లో పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్ బీసీ పక్షాన నిలబడుతోందన్నారు. బంద్ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం రద్దుచేసినట్లు తెలిపారు.

సీఎంకు కృతజ్ఞతలు..

జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి మానాల మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న సీఎంకు, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

చికిత్స పొందుతూ మరో ఇద్దరి మృతి

- ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఒకే కుటుంబంలోని ముగ్గురు
- రెండు రోజుల క్రితం తండ్రి, తాజాగా తల్లీకుమారుడు మృత్యువాత

నిజామాబాద్‌అర్బన్: ఒకే కుటుంబంలోని ముగ్గురు ఇటీవల ఆత్మహత్యకు యత్నించగా, ఒకరు ఘటన మరుసటి రోజు మృతిచెందారు. చికిత్స పొందుతున్న మరో ఇద్దరు కూడా మృతిచెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్‌కు చెందిన దాసరి కిషన్‌కు భార్య నాగమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడికి వివాహం జరుగగా, పెద్ద కుమారుడికి వివాహం జరుగలేదు. దీంతో తనకు పెళ్లి చేయడం లేదని కోపంతో పెద్దకుమారుడు వంశీ మంగళవారం తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. ఈక్రమంలో వంశీ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే ఆ గడ్డి మందు డబ్బాను తల్లి తీసుకొని తాగింది. అనంతరం ఆమె వద్ద నుంచి తండ్రి తీసుకొని తాగాడు. దీంతో ముగ్గురు అపస్మారకస్థితిలో ఉండగా, స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. కిషన్ నగరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వంశీ గురువారం రాత్రి మృతిచెందగా, శుక్రవారం నాగమణి మృతిచెందారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో టౌన్ ఎస్సై ముజాహిద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోధన్ టౌన్(బోధన్): పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయని సీఐ వెంకట నారాయణ తెలిపారు. వివరాలు ఇలా.. పట్టణంలోని తట్టికోట్ కాలనీకి చెందిన ఆకాష్‌తోపాటు మరో యువకుడు గురువారం అర్ధరాత్రి బేకరీలో పని ముగించుకొని ఇంటికి బయలుదేరారు. ఇరువురు బస్టాండ్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఓ కారు వేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆకాష్ భార్య శ్వేత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బేకరీ బయట ఉన్న మరో మూడు బైక్‌లను సైతం కారు ఢీకొట్టిందని సీఐ వెల్లడించారు.

385 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారులోగల వైభవ్ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీ (రైస్ మిల్లు) నందు ప్రజా పంపిణీకి సంబంధించి 385 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుని, రైస్‌మిల్లు యజమాని నగేష్, ఆపరేటర్ బాలాజీపై కేసు నమోదు చేసినట్టు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 15న రాత్రి మిల్లుపై పోలీసులు దాడి చేయగా, వాహనంలో ఇతరచోటికి తరలించటానికి సిద్ధంగా ఉన్న 127 క్వింటాళ్ల బియ్యంను పట్టుకున్నామన్నారు. తర్వాత మిల్లులో తనిఖీ చేయగా నిల్వ ఉంచిన 257 క్వింటాళ్ల బియ్యం లభించాయని తెలిపారు. బియ్యంను అమ్రాద్ రాజరాజేశ్వర రైస్ మిల్లులో భద్రపరిచినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు చెక్కుల ప్రదానం



నిజామాబాద్ సిటీ: దసరా సీజన్ నేపథ్యంలో ఆర్టీసీ వారు 'లక్కీడ్రా' కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్టాండ్ వరకు ఆర్టీసీ లగ్జరీ, సూపర్ లగ్జరీ, రాజధాని బస్సులపై ప్రయాణించిన వారికి డ్రాలో పాల్గొనే అవకాశం కల్పించింది. దీంతో సదరు ప్రయాణికులు తమ టికెట్ల వెనుకాల తమ ఫోన్ నంబర్లను రాసి, బస్టాండ్‌లోని లక్కీడ్రా పెట్టెలో వేశారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోగల ఆర్ఎం కార్యాలయంలో ఇటీవల డ్రా తీశారు. విజేతలకు శుక్రవారం ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి చెక్కులు అందించారు. మొదటి బహుమతి కింద యస్.చంద్రయ్యకు రూ.25 వేలు, రెండో బహుమతి కింద షేక్ బాబర్‌కు రూ.15 వేలు, మూడో బహుమతి కింద రాంప్రసాద్‌కు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎం జోత్స్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, పరమాత్మ, ఆనంద్ బాబు, డీఎం–1 ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనమైన కుటుంబ వ్యాపార నేపథ్యం ఉన్నంత మాత్రాన...
'విజయం అనివార్యం' అని చెప్పడానికి లేదు.
అంకితభావం, కష్టం ఉంటేనే విజయం సొంతం అవుతుంది.
ఘనమైన కుటుంబ వ్యాపారనేపథ్యం లేనంత మాత్రాన...
'విజయం దూరం' అని చెప్పడానికి లేదు.
ఆసక్తికి అంకితభావం, కష్టం తోడైతే విజయం సొంతం అవుతుంది.
దీనికి తాజా ఉదాహరణ... అవెండస్ వెల్త్-హురున్ ఇండియా-2025 జాబితా.
35 ఏళ్ల లోపు ప్రతిభావంతులైన 155 మంది యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు వెల్త్-హురున్ ఇండియా జాబితాలో చోటు సాధించారు.
వీరిలో...
వారసత్వ బాధ్యతకు తమ శక్తియుక్తులను జోడించి తమదైన గుర్తింపు తెచ్చుకున్నవారు ఉన్నారు. కొన్ని ఉత్పత్తులలో లోపాలు కనిపెట్టి లోపాలు లేని, సౌకర్యవంతమైన ప్రొడక్ట్స్ కోసం ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారి విజయం సాధించిన వారూ ఉన్నారు... వారిలో కొందరు యంగ్ ఫిమేల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి..

యువ హవా


అవంతిక సరొగి

దేశంలో తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్

చెరకు, బయోప్లాస్టిక్‌కు సంబంధించిన ఆపరేషన్‌లలో యువ మార్గదర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది అవంతిక సరొగి. కాలిఫోర్నియాలో చదువుకున్న అవంతిక తమ బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్ లిమిటెడ్ (బీసిఎంఎల్)ను పీఎల్‌ఏ (పాలీలాక్టిక్ యాసిడ్) తయారీ సౌకర్యాన్ని అందించే కంపెనీగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో ఉంది. ఇది మన దేశంలోని మొట్ట మొదటి బయోప్లాస్టిక్ ప్లాంట్ కానుంది.

పీఎల్‌ఏ అనేది చెరకు పునరుత్పాదక వనరుల నుండి తయారైన బయో ఆధారిత, కంపోస్టబుల్, తక్కువ ఉద్గారాల ప్లాస్టిక్. దీనిని సాధారణంగా ప్యాకేజింగ్, త్రీడి ప్రింటింగ్‌లో ఉపయోగిస్తారు.

మన దేశంలోని ఈ తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్ వల్ల బీసిఎంఎల్ లాభాల బాటలో పయనించనుంది. టర్నోవర్ పెరగనుంది. పర్యావరణ అనుకూలంగా కూడా మారనుంది.

తరగతి గదిని మార్చేలా


పరిత పరేఖ్

వినూత్నమైన ఆలోచన విధానంతో విద్యా, సాంకేతిక రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ పరిత పరేఖ్. బ్రౌన్ యూనివర్శిటీలో చదువుకుంది. బ్రౌన్ తరువాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో 'ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్'పై మాస్టర్స్ చేసింది. స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకునే రోజుల్లో పిల్లల విద్యావిధానం మీద దృష్టి పెట్టేది. స్టాన్‌ఫోర్డ్‌లో చేసిన పరిశోధనలు, నేర్చుకున్న ఆధునిక సాంకేతిక విషయాలు ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించాయి.

కట్టింగ్-ఎడ్జ్ ఎడ్యుకేషనల్ టెక్ ప్లాట్‌ఫామ్ 'టొడెల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించింది పరిత. మూస బోధన పద్ధతులకు అతీతంగా ఆధునిక బోధన పద్ధతులు, ఆలోచనలతో 'టొడెల్' ప్లాట్‌ఫామ్‌కు రూపకల్పన చేసింది. 'టొడెల్' ప్రభావంతో చాలా బడులలో ఉపాధ్యాయుల బోధన పద్ధతి మారింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంప్రదాయ, ఆధునిక విద్యాబోధనలో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి 'టొడెల్' కృషి చేస్తోంది.

విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించే ప్రణాళికలతో 'టొడెల్' విద్యాప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సాధించింది.


మినూ మార్గరెట్

సక్సెస్‌ఫుల్ యూఎస్పీతో...

ప్రారంభ కష్టాల మాట ఎలా ఉన్నా... ఉమెన్ యాక్టివేర్ 'బ్లిస్‌క్లబ్' మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఈ ఆన్‌లైన్ బ్రాండ్ ఆ తరువాత రెండు ఆఫ్‌లైన్ స్టోర్‌లను కూడా లాంచ్ చేసి విజయం సాధించింది. 'మార్కెట్‌లో ఎన్నో బ్రాండ్‌లు ఉన్నాయి కదా. మీ ప్రత్యేకత ఏమిటి?' అనే ప్రశ్న 'బ్లిస్‌క్లబ్' ఫౌండర్, సీయీవో మినూ మార్గరెట్ ముందు వచ్చి నిల్చుంది. సిగ్నేచర్ ఫ్యాబ్రిక్స్, వినూత్నమైన ప్రొడక్ట్ డిజైన్‌ను తమ కంపెనీ యూఎస్పీగా చేసుకొని విజయం సాధించింది మార్గరెట్.

నేషనల్ లెవెల్ ఫ్రిస్బీ ప్లేయర్ అయిన మినూ మార్గరెట్ యాక్టివేర్‌కు సంబంధించిన డీసెంట్ ఆప్షన్స్ గురించి ఆలోచిస్తున్నప్పుడు 'బ్లిస్‌క్లబ్' స్టార్టప్ ఆలోచనవచ్చింది.

'యాక్టివేర్ రంగంలోని కంపెనీలు డిజైన్ ఫస్ట్ విధానాన్ని అనుసరిస్తాయి. మేము మాత్రం ఈ విధానానికి దూరంగా ఉన్నాం. బ్లిస్‌క్లబ్‌కు డిజైన్ క్లబ్ లేదు. ప్రొడక్ట్ ఇంజినీరింగ్ టీమ్ మాత్రమే ఉంది. ఈ టీమ్ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం యాక్టివేర్ సౌలభ్యానికి సంబంధించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడం. ఉదాహరణకు చెన్నైలోని ఒక మహిళ గురించి. వేడి వాతావరణంలో ఆమెకు లెగ్గింగ్స్ ధరించడం కష్టమయ్యేది. ఇలాంటి సమస్యను దృష్టిలో పెట్టుకొని వేడివాతావరణంలో కూడా సౌకర్యంగా ఉండే లెగ్గింగ్స్‌ను డిజైన్ చేశాం' అంటుంది మార్గరెట్.


నీతూ యాదవ్ - కీర్తి జాంగ్ర

చిన్న గదిలో మొదలై... కోట్ల టర్నోవర్ వరకు

బెంగళూరులోని చిన్న గదిలో మొదలైన 'యానిమల్' రూ.550 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ స్థాయికి చేరింది. ఐఐటీ-ఢిల్లీలో చదువుకున్న కీర్తి జాంగ్ర, నీతూ యాదవ్‌ల బ్రెయిన్ చైల్డ్ 'యానిమల్'. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అవ్యవస్థీకృతంగా ఉన్న మన దేశంలోని పశువుల మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

పశువుల క్రయవిక్రయాలలో 'యానిమల్' యాప్ కీలక పాత్ర పోషిస్తోంది. తమ స్టార్టప్‌ను ప్రారంభించడానికి ముందు సర్వే నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు కీర్తి, నీతూ యాదవ్. డైరీ ఇండస్ట్రీలో కీలకమైన మార్పు తేవాలనుకున్న కీర్తి, నీతూ యాదవ్‌లు 'యానిమల్' యాప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా మనం ఉన్న చోటు నుంచే వందల కిలోమీటర్‌ల దూరంలో పశువుల క్రయ విక్రయాలు జరుగుతున్న ప్రదేశం తదితర వివరాలు తెలుసుకోవచ్చు.



దీపావళి వెనుక ఉన్న పురాణాలు

పిల్లలూ... మీకు ఇష్టమైన పండుగలలో దీపావళి ముందు వరుసలో ఉంటుంది కదూ.
దీపాలు వెలిగించడం, టపాసులు పేల్చడం, పిండివంటలను ఆరగించడం...
భలే సరదా. అయితే అసలు దీపావళి పండుగ ఎందుకు జరుపుకుంటాం, ఈ వేడుక వెనకున్న కథలేంటి తెలుసుకుందాం.

నేటి 'సాక్షి ప్లస్' కిడ్స్ ఈపేపర్‌లో

వంటిల్లు

తియ్యటి వేడుక


ముచ్చటగా అలంకరించిన లోగిళ్లు
అందంగా ముస్తాబైన చిన్నా పెద్దలు
ఓ వైపు దీప కాంతులు
మరోవైపు బాణాసంచా పేలుళ్లు
ఆనందాలు విప్పారుతుండగా
తియ్యని రుచులు నోరారా ఆస్వాదిస్తుంటే
వేడుకంతా నట్టింట్లో కొలువుదీరినట్టే ఉంటుంది.
రెట్టింపు ఆనందాలను పంచడానికి
వంటిల్లు తీపి వంటకాలను
సిద్ధం చేస్తూనే ఉంటుంది.
ఎక్కువ శ్రమ లేకుండా పండగవేళ
తియ్యని రుచులను సులువుగా చేసేద్దాం.
ఇంటిల్లిపాదికి ఆనందాన్ని పంచేద్దాం..



సూజీ హల్వా

కావలసినవి: సూజీ (బొంబాయి రవ్వ) - కప్పు; నీళ్లు - 2 కప్పులు; పంచదార - కప్పు; నెయ్యి - 3 టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి - పావు టీ స్పూన్; జీడిపప్పు, కిస్‌మిస్ - అవసరమైనంత.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడిపప్పు, ద్రాక్ష వేయించాలి. ● వాటిని తీసి, అదే నెయ్యిలో సూజీ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● మరో పాత్రలో నీరు మరిగించి, రవ్వ పోస్తూ, కలపాలి. ● రవ్వ ఉడికిన తర్వాత పంచదార కలిపి తర్వాత యాలకుల పొడి వేసి కలపాలి. ● చివరగా వేయించిన కాజు, ద్రాక్ష వేసి మిక్స్ చేయాలి.



గులాబ్ జామూన్

కావలసినవి: రెడీమేడ్ జామూన్ మిక్స్ - కప్పు; నీళ్లు/పాలు - అవసరమైనంత (జామూన్ మిక్స్ కలపడానికి); పంచదార - ఒకటింపావు కప్పులు; నీళ్లు - కప్పు; యాలకుల పొడి - చిటికెడు.

తయారీ: ● పంచదార, నీళ్లు కలిపి, మరిగించి సిరప్ తయారు చేయాలి. దాంట్లో చిటికెడు యాలకుల పొడి కలపాలి ● జామూన్ మిక్స్‌కి కొంచెం నీళ్లు లేదా పాలు జోడించి మృదువుగా కలపాలి ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, ఉండలు చేయాలి ● బాణలిలో నూనె పోసి వేడయ్యాక, సిద్ధంగా ఉంచుకున్న ఉండలు వేసి, వాటిని గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి ● వేయించిన జామూన్లను వేడి సిరప్‌లో వేసి, రెండు గంటలు నాననివ్వాలి.



రైస్ పుడ్డింగ్ / పాయసం

కావలసినవి: బియ్యం - పావు కప్పు; పాలు - 3 కప్పులు; పంచదార - పావు కప్పు; యాలకుల పొడి - పావు టీ స్పూన్; యాలకులు, కిస్‌మిస్ - అవసరమైనంత; నెయ్యి - టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యం కడిగి, కొద్దిగా ఉడికాక పాలు పోసి, మెల్లిగా మరిగించాలి. ● బియ్యం పూర్తిగా ఉడికాక పంచదార కలపాలి. ● యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి.



బేసిన్ లడ్డూ

కావలసినవి: బేసన్ (సెనగపిండి) - కప్పు; నెయ్యి - పావు కప్పు; పంచదార పొడి - పావు కప్పు; యాలకుల పొడి - పావు టీ స్పూన్.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేసి, వేడి చేయాలి. మంట బాగా తగ్గించి, దాంట్లో శనగపిండి వేసి, మెల్లగా బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● చల్లారిన తర్వాత పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి. ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, చేతులతో లడ్డూలు చేయాలి.



వామ్మో..

ఏ(ఐ)డడుగులు..!

మన పురాతన తాటాకు శాసనాల గ్రంథాల్లో అన్నీ ఉన్నాయో లేవోగానీ... మన సినిమాల్లో మాత్రం సకల విజ్ఞాన శాస్త్రాలూ ఉన్నాయి. అందుకు నిదర్శనమే మనదైన పానిండియన్ సూపర్‌హిట్ బ్లాక్‌బస్టర్ సినిమా 'రోబో'!

ఏ అద్భుత ముహూర్తాన మన డైరెక్టర్ శంకర్ 'రోబో' తీశాడోగానీ... లోకమంతటా అవే వింతలు అచ్చం అలాగే జరుగుతున్నాయి. ఉదాహరణకు...

ఇక్కడి మన సినిమాలో హ్యూమనాయిడ్ రోబో కాస్తా మానవ మానస వికాసాలూ, వికారాలూ ఒంటబట్టించుకుని 'రోబో సేపియన్' అవుతాడా! అలా అవ్వగానే ఆ 'టాయ్'ఫ్రెండు కాస్తా హీరోయిన్‌కి 'బాయ్'ఫ్రెండుగా మారి... అచ్చం మన మానవ కుర్రాళ్లలాగే... తనను ప్రేమించని అమ్మాయి మీద యాసిడ్లా గట్రా విసిరేంత క్రూరమైన 'సెల్ఫ్‌స్టైల్డ్ లవర్‌బా(టా)య్'గా మారిపోతాడు కదా.

అక్కడ అమెరికాలోని ఒహాయో రాష్ట్ర చట్టనిపుణులు బహుశా 'రోబో' సినిమా చూసి హడలిపోయి ఉంటారేమో... మానవ మేధకూ, కృత్రిమ మేధస్సుకూ మధ్య వివాహాలు వద్దంటే వద్దంటూ గొడవ గొడవ చేస్తున్నారు. అంతేనా... ఆ మేరకు ఓ చట్టం తీసుకువచ్చేందుకు బిల్లు కూడా ప్రిపేర్ చేశారు.

అదే డైరెక్టర్ శంకర్‌గారి ఆయొక్క అదే 'రోబో' సినిమాలో... "ఇనుములో ఓ హృదయం మొలిచెనే" పాటనుంచి స్ఫూర్తి పొందినట్టుగా... ఇప్పటికే మన పొరుగు దుండగీడైన చైనావాడు 'దివిరి ఇసుకన తైలంబు' రీతిగా దివిరి ఇనుమున గర్భసంచి నుంచి చిన్నారి పాపలను రేపోమాపటికి తీసిస్తానంటూ తొడలుగొడుతూ, హడలగొడుతున్నారన్న సంగతి తెలిసిందే. అంతే కాదు... రోబోలకు సీమంతాలవీ గట్రా చేసేసి కృత్రిమ 'ఊంబ్'ల లోంచి ఉంగా ఉంగా పాపాయిలను పుట్టిస్తానంటూ సవాళ్లు విసురుతున్నారు కూడా.

అమిత వింతలకు నెలవైన అమెరికాలో... ఈ చిత్రవిచిత్రాలన్నీ చూస్తున్న ఒహాయో రాష్ట్రపు మేధావులు భయపడిపోతున్నారేమో... ఆ ఆందోళనతో స్థిమితంగా ఉండలేక... బహ్మాండమైన ఓ వివాహ నిషేధ చట్టాన్ని తెచ్చేందుకు నిశ్చయించుకున్నారు. ఆ మేరకు బిక్కు బిక్కుమంటూ బిల్లొకదాన్ని అక్కడి చట్టసభల్లో ప్రవేశపెట్టబోతున్నారు కూడా! దీనికి కారణమేంటంటే... అక్కడి కుర్రకారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెళ్లిళ్లు చేసుకునేందుకు తెగ ఉత్సాహపడిపోతున్నారట!

హాయ్యో...! ఇప్పటికే అతి మేధావులైన మానవులూ, అమితమైన మేధస్సుల 'కృత్రిమ మేధ' మధ్య పెళ్లిళ్లు జరిగితే... రేపు సదరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కాస్తా పవరాఫ్ ఆటార్నీలంటూ పవర్‌పట్టా తీసుకోవడం, పార్ట్‌నర్‌తో చెట్టాపట్టాలే కాకుండా, లీగల్ వ్యవహారాల్లోకి దూరి, అసలు నిపుణులు తట్టాబుట్టా సర్దుకునేలా, చెట్టుపుట్టా పట్టుకుపోయేలా, బెదిరీ చెదిరీ పోయేలా చేస్తాయేమోనని హడలెత్తుతున్నారు 'ఒహాయో రాష్ట్ర'పు చట్ట నిపుణులు.

అందుకే... మనుషులకూ, యంత్రాలకు మధ్య పెళ్లి మంత్రాలు వద్దంటే వద్దంటూ పట్టుపడుతున్నారు. మానవులూ, యాంత్రాల మధ్య మనువులు వద్దంటూ వాదిస్తున్నారు. ఇది 'యంత్రమాత్రమూ' తగదంటూ బల్లగుద్ది మరీ శాసిస్తున్నారు మన ఒహాయో స్టేట్ రిప్రజెంటేటివూ, రిపబ్లికన్ మెంబరూ అయిన మిస్టర్ 'థాయిడస్ క్లాగెట్' గారు!

అలనాడెప్పుడో బ్రహ్మంగారు చెప్పిన వింతలన్నీ అక్కడా ఇక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడీ నేపథ్యంలో ఈ పుట్టు తెలివితేటలున్న మన మానవాళీ... పెట్టు తెలివితేటలున్న రోబోయంత్రాళీ... కలగలిసి సంకరమైతే... రేపు భవిష్యత్తులో సకల 'అతి'తెలివితేటలున్న బుజ్జిబుజ్జి రోబో-కంగాళీలకు ఆస్కారముంటుందేమోనని అనుమానిస్తున్నారు.

అచ్చం రోబో సినిమాలోలాగే... రేపెప్పుడైనా పొరబాటున ఆ 'చిట్టి' చిట్టి రోబోలకు విలనీయులైన ఏ అడ్డమైన సైంటిస్టులో 'రెడ్డు చిప్పు' పెడితే... అప్పుడది మన మానవాళి చేతికి 'డేంజరు చిప్పే'ననేమోనంటూ ఇన్నిరకాల ఆంక్షలూ, హాహాకారాలంటూ లోకంలోని ప్రజలంతా తెగ చెవులు కొరుక్కుంటున్నారన్నది అభిజ్ఞ వర్గాల అతి రహస్య భోగట్టా.

- యాసీన్

ఏఐ మ్యారేజ్ ప్రపోజల్



ప్రేమలేఖల నుంచి ఎస్‌ఎంఎస్‌ల వరకు లవ్, మ్యారేజ్ ప్రపోజల్స్ పలు రకాలు. తాజా విషయానికి వస్తే...ఒక కుర్రాడు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ను ఉపయోగించి ఫేక్ డిస్నీ-స్టైల్ ట్రైలర్ ద్వారా తన స్నేహితురాలికి మ్యారేజ్ ప్రపోజ్ చేశాడు. ఈ వీడియోకు 11 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి. ఈ వీడియోను ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీషేర్ చేస్తున్నారు. 'ది ఈజీయెస్ట్ యస్. యస్, ప్రపోజ్‌డ్ టు జె... యూజింగ్ ఏఐ' అని వీడియోకు కాప్షన్ ఇచ్చారు. వీడియో చివరలో 'విల్ యూ మ్యారీ మీ' అనే కామెంట్ కనిపిస్తుంది. ఇంతకీ ఆ అమ్మాయి 'యస్' చెప్పిందా? యస్! 'ది మోస్ట్ బ్యూటీఫుల్ మ్యారేజ్ ప్రపోజల్' అంటూ స్పందించారు నెటిజనులు.

ధన త్రయోదశి

ఆరోగ్యమస్తు ధనప్రాప్తిరస్తు



నేడు ధనత్రయోదశి. సాధారణంగా ధన త్రయోదశి అనగానే బంగారం, వెండి, ఇతర గృహోపకరణాలు కొనడం అందరూ చేసేదే. అయితే ధనత్రయోదశి ప్రాశస్త్యాన్ని తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ఆ కథ తెలుసుకుందాం.

దేవతలు, దానవులు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలుకుతున్న సమయంలో ఆ క్షీరసాగరం నుంచి శ్రీ మహాలక్ష్మి జన్మించింది. అంతే కాదు సంపదలను ప్రసాదించే కల్పవృక్షం, కామధేనువు, దేవవైద్యుడు ధన్వంతరి కూడా శ్రీ మహాలక్ష్మితో పాటే జన్మించారు. ఆ రోజు ఆశ్వయుజ బహుళ త్రయోదశి. శ్రీమహాలక్ష్మి ..., ధనానికి ప్రతిరూపం. అందుకే., ఆమె జన్మదినమైన ఈ ఆశ్వయుజ కృష్ణ త్రయోదశిని.. 'ధన త్రయోదశి' అన్నారు.

ఎంత చదువు చదివినా.,, ఎన్ని తెలివితేటలు ఉన్నా., శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లేకపోతే జీవితం గడపడం కష్టం. అందుకే.. సర్వ సంపత్‌ప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం సర్వ మానవాళి ఈ రోజున శ్రీమహాలక్ష్మిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, ఆమె ఆశీస్సులు అందుకుంటారు.

ధనానికి అధిదేవత 'శ్రీమహాలక్ష్మి. ధనానికి అధినాయకుడు ఉత్తర దిక్పాలకుడైన 'కుబేరుడు'. అందుకే ఈ ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మితోపాటు కుబేరుని కూడా ఆరాధిస్తారు. సాధారణంగా ఈ లక్ష్మీ పూజను సాయం సమయంలో ప్రదోష వేళలో చేసుకుంటే చాలా మంచిది.

లక్ష్మీ కుబేర వ్రతం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, వ్యాపార అభివృద్ధి అదే విధంగా నూతన వ్యాపారం ప్రారంభించబోయే వారు, ఉద్యోగ అభివృద్ధి కోరుకుంటున్నవారు, అప్పుల బాధలు ఉన్నవారు లక్ష్మీ కుబేర వ్రతాన్ని చేసుకోవడం వల్ల ఆయా బాధల నుంచి విముక్తి పొంది, అన్నింటా అభివృద్ధి జరుగుతుందని పెద్దలు చెబుతారు కాబట్టి ఈ వ్రతాన్ని చేయాలనుకుంటున్న వారు అక్షయ తృతీయ రోజు, ధన త్రయోదశి రోజు, కార్తీక శుక్ల పంచమి రోజు లేదా తొమ్మిది గురువారాలు లేక శుక్రవారాలు చేసుకోవచ్చు.

ధన్వంతరి జయంతి

దేవవైద్యుడు, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అంశావతారమైన ధన్వంతరి పాలసముద్రం నుంచి ఆవిర్భవించింది కూడా ధనత్రయోదశి నాడే. అందుకే ఈ పర్వదినాన చాలామంది ధన్వంతరిని కూడా పూజిస్తారు. ముఖ్యంగా ఆరోగ్యం బాగలేని వారు, ఆయుర్వేద వైద్య విధానం మీద నమ్మకం ఉన్న వారు శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన ధన్వంతరిని పూజించడం వల్ల ఆరోగ్యవంతులవుతారని చెబుతారు. ధన్వంతరి చేతిలో శంఖు చక్రాలతోపాటు ఔషధ భాండం లేదా అమృత కలశం, జలగ ఉంటాయి. జలగ శరీరంలో చేరిన చెడు రక్తాన్ని పీల్చివేసి ఆరోగ్యాన్నిస్తుందని ప్రతీతి. అందుకే ధన్వంతరి చేతిలో జలూకం అంటే జలగ ఉంటుంది.

నేడు శని త్రయోదశి కూడా. ధనత్రయోదశి నాడే శని త్రయోదశి కూడా రావడం చాలా విశేషం. అందువల్ల ఈ వేళ పాత వస్తువులు, పాత ఆలోచనలు, పాతదనాన్ని వదిలించుకుని, కొత్త వస్తువులు కొనుగోలు చేయటం, కొత్త ఆలోచనలు చేయటం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం చాలా మంచిది.

పితృదేవతాపూజకు కూడా ధనత్రయోదశి చాలా ప్రశస్తమైనది. ధనత్రయోదశి నాడు ఇంటిలో దీపాలు వెలిగించి, మన పెద్దవారిని తలచుకోవడం వల్ల వారి ఆశీర్వాదంతో శుభం చేకూరుతుందని పండితులు చెబుతారు. ఈ శుభవేళ అందరికీ కీడు తొలగి మేలు చేకూరాలని కాంక్షిద్దాం.

- డి.వి.ఆర్.

బులియన్
బంగారం 10 గ్రా.; వెండి కిలో
అక్టోబర్ 17న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,34,990	1,35,150	1,32,770	1,35,150	1,32,500	1,33,090
బంగారం (22 క్యారెట్లు)	1,24,590	1,21,700	1,21,700	1,25,350	1,21,900	1,22,000
వెండి	1,90,000	1,81,000	2,03,000	1,81,000	1,81,000	2,03,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.